ప్రజాశక్తి

సోమవారం 10 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

డిఎస్‌సి కష్టమే..!

◆ ఉమ్మడి విశాఖలో 553 ఉపాధ్యాయ పోస్టులు రద్దు
◆ నిరుద్యోగుల ఆశలు ఆవిరి
◆ విద్యకు పెడుతున్న ఖర్చును తగ్గించుకునే కుట్ర
◆ పేదలకు దూరంకానున్న ప్రాథమిక విద్య



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలపై ప్రభుత్వం నీళ్లుజల్లింది. భవిష్యత్తులో ఎస్‌జిటి పోస్టుల భర్తీ లేకుండా ఉపాధ్యాయుల మిగులుచూపి రద్దుచేసింది. నూతన విద్యా సంస్కరణలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి తగ్గించి తొలి దశలో 553 మంది మిగులు ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసింది. మరికొద్ది రోజుల్లో మరికొన్ని ఉపాధ్యాయ పోస్టుల రద్దుకు అవసరమైన కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సంఖ్య పెరగకుండా చూస్తూనే కర్నూలు జిల్లాలో మాత్రం అవసరమైన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే మిగతా 2లో..

ఉపాధ్యాయ పోస్టుల రద్దు సరికాదు



ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 553 ఎస్‌జిటి పోస్టులను రద్దు చేయడం సరికాదు. కర్నూలు జిల్లాలో 1553 ఉపాధ్యాయులు అవసరమని, ఉమ్మడి విశాఖ జిల్లాలో 553 పోస్టులు రద్దుచేసి, కర్నూలు జిల్లాకు తరలించడం అన్యాయం. కర్నూలు జిల్లాకు అవసరమైన పోస్టులు కొత్తగా మంజూరుచేయాలి. ప్రభుత్వ చర్యలు వల్ల భవిష్యత్తులో డిఎస్‌సి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. ఉపాధ్యాయ పోస్టులు రద్దును ఉపసంహరించుకోవాలి.

గొంది చినబ్బాయ్, యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

కమిషనర్ రాజాబాబు వ్యాఖ్యలపై దుమారం

'మ్యాడ్ డాగ్' పేరిట ఓ కార్పొరేటర్‌కు మెసేజ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జి 20 సమావేశాల నేపథ్యంలో జివిఎంసి నిధుల ఖర్చుపై ప్రతిపక్ష కార్పొరేటర్ తాజాగా ప్రశ్నించిన విషయమై జివిఎంసి కమిషనర్ రాజాబాబు స్పందించిన తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉంది. 'ఒక్క పైసా కూడా ప్రభుత్వం నుంచి రాకుండా, పనులకు ఎంత ఖర్చయిందో లెక్కలు వేస్తున్న క్రమంలో మ్యాడ్ డాగ్ మాదిరి మాట్లాడడం ఏమిటంటూ' ఆ ఉన్నతాధికారి తాజాగా చేసిన వ్యాఖ్యలు అధికార, ప్రతిపక్ష సభ్యుల్లోనేగాక యావత్ విశాఖ నగరంలో దుమారం రేపుతున్నాయి. పనులపై వివరణ సావధానంగా ఇవ్వాల్సిన స్థానంలో ఉన్న అధికారి ఈ రకంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జివిఎంసియే నిధులు ఖర్చు చేసినట్లు ప్రకటించిన ఆ అధికారి, మేయర్ తాజాగా ప్రభుత్వం నుంచి రాలేదని వెల్లడించడం విడ్డూరంగా ఉంది.

'ఆ వ్యాఖ్యలు దారుణం'

సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జి 20 సమావేశాల సందర్భంగా చేపట్టిన పనుల్లో జరిగిన కోట్లాది రూపాయల అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్న కార్పొరేటర్లపై జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు పిచ్చి కుక్కలుగా విమర్శలు చేయడాన్ని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనర్‌గా వ్యవహరించిన ఆయన అధికార పార్టీ నాయకునిగా ప్రతిపక్ష పార్టీల నాయకులను తూలనాడటం, తన అధికార పరిధి దాటి మాట్లాడటం చట్టవిరుద్ధమన్నారు. సభా హక్కుల ఉల్లంఘన కింద కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జి 20 సమావేశాలకు ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని కమిషనర్ అంటున్నారని తెలిపారు. ఈ సమావేశాలకు పెద్ద ఎత్తున జివిఎంసి నిధుల దుర్వినియోగం జరిగిందని గంగారావు పేర్కొన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేశారని తెలిపారు. అధికార పార్టీ అండతో ఈ అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. ఇప్పటికే పలు మార్లు ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని, బహిరంగ చర్చకు రావాలని సిపిఎం డిమాండ్ చేసిందని, అయినా ప్రభుత్వం నుంచి మిగతా 2లో..

మిల్లు తిప్పుతామన్నారు.. మడమతిప్పారు..

▶ వార్త 3లో..

జపాన్‌కు టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు

▶ వార్త 2లో..

మహిళా సర్పంచ్‌పై దాడి

▶ వార్త 8లో..



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం తీర్మానం వార్త మెయిన్‌లో..

ఇగ్నో పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు

◆ గ్రామీణ అధ్యయన కేంద్రాల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచడానికి కృషి
◆ ఈ ఏడాది నుంచి మరికొన్ని కొత్త కోర్సులు
◆ 'ప్రజాశక్తి'తో ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు ధర్మారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) పట్టభద్రులకు మెరుగైన ఉపాది అవకాశాలు దక్కుతున్నట్టు వర్సిటీ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇటీవల వర్సిటీ 37వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇగ్నో ప్రగతి, కోర్సుల వివరాలు, భవిష్యత్తు ప్రణాళికలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం పనితీరు ఎలా ఉంది ?

ఇగ్నో ప్రాంతీయ కేంద్రం విశాఖపట్నంలో 2011 మార్చి 29న ఏర్పాటైంది. రాష్ట్రంలో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం రెండోది. మా కేంద్రం పరిధిలో జిల్లాల విభజన అనంతరం 11 జిల్లాల పరిధిలో 12 అధ్యయన కేంద్రాలను నిర్వహిస్తున్నాం. వీటిలో విశాఖపట్నం జిల్లాలో 4, తూర్పుగోదావరి జిల్లాలో 3, శ్రీకాకుళం జిల్లాలో 1, విజయనగరం జిల్లాలో 2, ఏలూరులో 2 కేంద్రాలు ఉన్నాయి. ఈ



కేంద్రాలన్నీ ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉన్నాయి. విద్యార్థులు తమ అనుమానాల నివృత్తి, సహాయ సహకారాల కోసం ఈ 12 సెంటర్లనూ సంప్రదించవచ్చు. మా సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇగ్నో ద్వారా ఎవరైనా డిగ్రీ, పీజీ మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి..

డిఎస్‌సి కష్టమే..!

ఉమ్మడి విశాఖ జిల్లాలో జిఒ 155 ప్రకారం 156 ప్రాథమిక పాఠశాలల్లోని 156 ఎస్‌జిటి పోస్టులను, జిఒ 37ను అనుసరించి 397 ప్రాథమిక పాఠశాలల్లో 397 ఎస్‌జిటిల పోస్టులను ప్రభుత్వం రద్దుచేసింది.

ఉపాధ్యాయ మిగులు పోస్టుల రద్దు, సర్దుబాటు చర్యలతో భవిష్యత్తులో నిరుద్యోగులు ఆశించినట్లు డిఎస్‌సి ఉండదని అర్థమవుతోంది. రెండోవైపు పేదలకు ప్రాథమిక విద్య దూరంకావడంతో పాటు విద్యార్థులను సెక్షన్లుగా విభజించి ఉపాధ్యాయులను తగ్గించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందని పరిస్థితి ఏర్పడనుంది. విద్యకు పెడుతున్న ఖర్చును తగ్గించుకొనేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగంగా ఉపాధ్యాయులను వీలైనంతమేరకు తగ్గించాలని చూస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పి కోట్ల రూపాయలు ఖర్చుచేసిన ప్రభుత్వం నిర్మాణ పనులు పూర్తయిన తరువాత ఒక్కొక్కదాన్నీ మూసివేసుకుంటూ పోతోంది.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మండలాల వారీగా రద్దు చేసిన ఉపాధ్యాయ పోస్టులు ఇలా..

జిఒ 155 ప్రకారం : పెదగంట్యాడ మండలంలో 4, పరవాడలో 13, అనకాపల్లిలో 24, మునగపాకలో 10, కశింకోటలో 14, మాకవరపాలెంలో 13, కోటవురట్లలో 6, పాయకరావుపేటలో 12, నక్కపల్లిలో 16, ఎస్.రాయవరంలో 13, యలమంచిలిలో 9, రాంబిల్లిలో 11, అచ్యుతాపురంలో 11 ఉన్నాయి.

జిఒ 37 ప్రకారం : ముంచంగిపుట్టు మండలంలో 17, పెదబయలులో 15, హుకుంపేటలో 17, డుంబ్రిగుడలో 15, అరకులోయలో 12, అనంతగిరిలో 21, జికె వీధిలో 14, పాడేరులో 6, జి.మాడుగులలో 22, చింతపల్లిలో 14, కొయ్యూరులో 15, గొలుగుండలో 14, దేవరాపల్లిలో 10, చీడికాడలో 13, వి.మాడుగులలో 13, పెదగంట్యాడలో 4, గాజువాకలో 7, చినగదిలిలో 7, భీమునిపట్నంలో 9, నాతవరంలో 19, నర్సీపట్నంలో 13, రోలుగుంటలో 14, రావికమతంలో 17, బుచ్చెయ్యపేటలో 6, చోడవరంలో 12, కె.కోటపాడులో 14, సబ్బవరంలో 13, పెందుర్తిలో 14, ఆనందపురంలో 22, పద్మనాభంలో 8 ఉన్నాయి.

'ఆ వ్యాఖ్యలు దారుణం'

స్పందన కరువైందని అన్నారు. ఇప్పుడు కమిషనర్ మితిమీరి మాట్లాడటం సభాహక్కుల ఉల్లంఘనే అవుతుందని చెప్పారు. తన వ్యాఖ్యలను బహిరంగంగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా జి 20 సమావేశాల సందర్భంగా జివిఎంసి చేపట్టిన వివిధ పనుల్లో జరిగిన కోట్లాది రూపాయల అక్రమాలపై వెంటనే ఫ్లోర్ లీడర్లతో లేదా హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మేయర్‌ని, ఉన్నతాధికారులను కలిసి స్పందనలో ఫిర్యాదు చేయనున్నామని పేర్కొన్నారు.

ఇగ్నో పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు

అభ్యసించాలనుకుంటే ఈ అధ్యయన కేంద్రాలకు వెళ్తే పూర్తి సమాచారం లభిస్తుంది.

వర్సిటీ ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు ?

ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఇప్పటివరకూ 5150 మంది విద్యను అభ్యసిస్తున్నారు. అదేవిధంగా మొన్న జరిగిన 36వ వార్షిక స్నాతకోత్సవంనాటికి 1200 మంది పట్టభద్రులు అయ్యారు. వీరిలో 873 మంది డిగ్రీ , పీజీ విద్యార్థులుకాగా 367 మంది వివిధ రకాల సర్టిఫికేషన్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించారు.

ఇగ్నోలో అందుబాటులో ఉండే కోర్సులు ఏంటి ?

మా ప్రాంతీయ కేంద్రం పరిధిలో బిఎ, బికాం, బిఎస్‌సిలతోపాటు బిఎ హానర్స్‌కు సంబంధించి అన్ని డిగ్రీలూ అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా స్పెషల్ హిందీ, స్పెషల్ ఉర్దూ భాషల్లో డిగ్రీలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు పీజీలో ఎంఎ ఇంగ్లీష్, ఎంఎ తెలుగు, ఎంఎ సంస్కృతం, ఎంఎ టూరిజం మేనేజ్‌మెంట్, ఎంఎ జర్నలిజం, ఎంబిఎ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీతో పాటు పలు పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పలురకాల సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాం. వాటిలో ముఖ్యంగా బిజినెస్ స్కిల్, కమ్యూనిటీ రేడియో, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ది ఎనర్జీ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌తో పాటు పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఇగ్నో భవిష్యత్తు ప్రణాళికలు ఎలా ఉండనున్నాయి ?

ఈ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని గ్రామీణ అధ్యయన కేంద్రాలలో విద్యార్థుల అడ్మిషన్లు పెంచడానికి, నిరుద్యోగ గ్రామీణ యువతకు తోడ్పాటునందించే కొత్త నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించడానికి కృషి చేస్తున్నాం. వాటిలో ఈ ఏడాది నుంచి కొత్తగా ఎంఎ జర్నలిజంలో ఎంఎ డిజిటల్ మీడియా, ఎంఎ ఎలక్ట్రానిక్ మీడియా కోర్సులు ప్రవేశ పెడుతున్నాం. అలాగే వివిధ కొత్త కోర్సులను విశాఖపట్నం ప్రాంత విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నాం. ఇగ్నో అధ్యయన కేంద్రాలు లేనిచోట కొత్త అధ్యయన కేందాల ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించాం. ఇగ్నో అధ్యయన కేంద్రం విస్తరణలో భాగంగా విశాఖపట్నంలో ఐదో సెంటర్‌గా విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కొత్త అధ్యయన కేంద్రాన్ని అతి త్వరలో ప్రారంభించనున్నాం. పార్వతీపురం మన్యంలో పాలకొండ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, అరకు ప్రాంతాల్లో కొత్త అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

జపాన్‌కు టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రోటరీ విశాఖ వ్యాలీ మాజీ ప్రెసిడెంట్ బి.బాబ్జీ నేతృత్వంలో రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ, రొటేరియన్ మంద వెంకట జానకిరామ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఎల్-ఏంజెల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్ జపాన్ సంయుక్తంగా స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ సహకారంతో టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లను నిర్వహించాయి. ఈ పోటీల్లో టాపర్స్‌గా నిలిచిన నలుగురిని జపాన్‌కు పంపేందుకు ఎంపిక చేశారు. వీరిలో ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు ఉన్నారు. జపనీస్ సహచరులతో ఆడటానికి, కొన్ని మెళకువలు నేర్చుకోవడానికి ఈ పర్యటన ఎంతో ఉపకరిస్తుందని జానకిరామ్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలుర విభాగం నుంచి టి.సూర్యతేజ (కాకినాడ), ఎం.వెంకట కార్తికేయ (విజయవాడ) ఎంపిక కాగా బాలికల విభాగంలో రాంజలి కాజోల్ సునర్ (విజయవాడ), ఫాల్గుణ్ చార్వి (రాజమండ్రి) ఎంపిక అయ్యారని, వీరితోపాటు కోచ్ కెవి.మురళీమోహన్ పాత్రోను జపాన్‌కు పంపడానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 20న మందా నేతృత్వంలో బందం జపాన్‌కు బయలుదేరు తుందన్నారు.



క్రీడాకారులతో జానకిరామ్, తదితరులు

సుమారు 10 రోజుల పాటు జానకిరామ్, జి.పాండు రంగారావుల ఆధ్వర్యంలో ఈ పర్యటన జరుగుతుందని తెలిపారు .టేబుల్ టెన్నిస్‌లో జపాన్‌లోని నిష్ణాతులచే శిక్షణ ఇప్పించడంతో పాటు అక్కడ అన్ని ముఖ్యమైన సందర్శనా స్థలాలకు తీసుకెళ్తారన్నారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ, దేశీయ ఛాంపియన్‌షిప్‌లలో భారత ఆటగాళ్లు రాణించడానికి ఇటువంటి పర్యటనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రొటేరియన్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మానవ హక్కుల పరిరక్షణలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అమోఘమని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వై.సత్యనారాయణ కొనియాడారు. మానవ హక్కుల కౌన్సిల్ సర్వసభ్య సమావేశం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మానవ హక్కులకు భంగం కలిగిస్తుంటాయన్నారు. అలాంటి సమయంలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు పౌర హక్కుల పరిరక్షణకు బాధితుల తరపున చేసే పోరాటాన్ని మరువలేమన్నారు. మున్ముందూ ఆ పోరాటాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు పౌర హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పౌర హక్కుల ఉల్లంఘన జరిగిన బాధితుల పక్షాన నిలబడి తాము పోరాడి ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. పౌరహక్కుల పరిరక్షణకు రాజీ లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు తరచూ మానవ హక్కులను కాలరాసే విధంగా ప్రవర్తిస్తున్నాయని మండిపడ్డారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని ప్రభుత్వాలను హెచ్చరించారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రాంబాబు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు న్యాయవాదులుగా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మానవ హక్కులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి బాధితులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్‌వి రమణ మాట్లాడుతూ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు బిఎస్ లత, మాధవి పాల్గొన్నారు.

అంధుల చెస్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లాసన్స్ బే కాలనీలో తెలుగు రాష్ట్రాల అంధుల చెస్ పోటీల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఎంపీ జివిఎల్.నరసింహారావు, కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కరణంరెడ్డి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ మే 6, 7 తేదీలలో గాజువాక ఆర్‌జిఐ స్టేడియంలో ఎబిసి ఛారిటబుల్ ట్రస్ట్, ఎఎన్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జరగబోయే పోటీలకు రెండు వందల మంది క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు. మూడు కేటగిరీలలో నలభై వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయన్నారు. క్రీడాకారులకు భోజన వసతులను ట్రస్టు సభ్యులు డాక్టర్ స్వరూప్ ఎఎన్ఆర్ సౌజన్యంతో ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, రాహుల్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మే 21న అఖిల భారత ఆదివాసీ సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గిరిజనుల హక్కులు, భూముల పరిరక్షణ లక్ష్యంగా మే 21న విశాఖపట్నంలో అఖిల భారత ఆదివాసీ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు వివి.రమణమూర్తి తెలిపారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆయన మాట్లాడారు.

లాసిక్ చికిత్సలతో సంధ్య కంటి ఆసుపత్రి రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేత్ర వైద్య రంగంలో విశేష ఖ్యాతి గడించిన సంధ్య కంటి ఆసుపత్రి 10 వేల లాసిక్ చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి కీలక మైలురాయిని అధిగమించింది. కళ్లజోడు, కాంటాక్ట్ లెన్స్‌ల నుంచి శాశ్వతంగా విముక్తి కలిగించేలా అంతర్జాతీయ స్థాయి పర్సనలైజ్డ్ జర్మన్ టెక్నాలజీ లాసిక్ చికిత్సలు ఈ ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఇసుకతోటలోని సంధ్య కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మునగపాటి భార్గవ్‌రామ్ మాట్లాడుతూ సంధ్య కంటి ఆసుపత్రి ద్వారా గడచిన మూడున్నర దశాబ్దాలుగా ప్రజలకు నేత్ర వైద్య చికిత్సలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, ప్రపంచ శ్రేణి కంటి చికిత్సలను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. అత్యంత అనుభవజ్ఞులైన నేత్ర వైద్య నిపుణుల ఆధ్వర్యంలో, నేత్ర సంబంధ వ్యాధులకు నాణ్యమైన చికిత్సలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రముఖ లాసిక్ చికిత్సా నిపుణులు డాక్టర్ శశికపూర్ మాట్లాడుతూ..

సంధ్య కంటి ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన జర్మన్ టెక్నాలజీ లాసిక్ విధానం ద్వారా దృష్టి లోపాలను అత్యంత ప్రభావవంతంగా పరిష్కరించవచ్చని అన్నారు. సమావేశంలో సంధ్య కంటి ఆసుపత్రి సెంటర్ మేనేజర్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి చంద్రబాబు హానికరం'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు హానికరమని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఆదివారం ఉదయం వైసిపి నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్‌ను సొంత బిడ్డలా ప్రజలు ఆదరిస్తుంటే తట్టుకోలేకపోతున్న చంద్రబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు పాలనంతా అవినీతిమయమని పేర్కొన్నారు. 2024 ఎన్నికలతో ఆయన రాజకీయాలు పరిసమాప్తం అవుతాయని జోస్యం చెప్పారు.

మిల్లు తిప్పుతామన్నారు.. మడమతిప్పారు..

- జ్యూట్ మిల్లు మూతపడి 20 నాటికి 14ఏళ్ళు
- చెట్టుకొకరు పుట్టకొకరుగా కార్మికులు, కుటుంబాలు
- శిథిల క్వార్టర్లలోనే బితుకు బితుకుమంటూ నివాసం



మూతపడిన భీమిలి జ్యూట్ మిల్లు



ప్రస్తుతం లే-అవుట్లు వేసి అమ్మకానికి పెట్టిన జ్యూట్ మిల్లు స్థలం

ప్రజాశక్తి -తగరపువలస : చారిత్రక చిట్టివలస జ్యూట్ మిల్లు శాశ్వతంగా మూతపడి ఏప్రిల్ 20 నాటికి 14ఏళ్ళు పూర్తవుతోంది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం మొండి వైఖరి, పాలకుల స్వార్థ ప్రయోజనాలు, చేతకాని తనానికి 2009 ఏప్రిల్ 20న మూత పడింది. దీంతో ఇందులో పనిచేసిన దాదాపు ఆరువేల మంది కార్మికుల్లో ఎక్కువ మంది ఉపాధి కోసం వలసలు వెళ్లారు. మిల్లు మూతపడడానికి ముందు పర్మినెంట్, స్పెషల్ బదిలీ కార్మికులు 2,988 మంది, బదిలీ కార్మికులు 1100 మంది, అప్రెంటిస్‌లు సుమారు 2వేల మంది పని చేసేవారు.

జీతభత్యాల విషయానికి వస్తే టైమ్ రేటు, పీస్ రేటు పద్ధతిలో వేతనాలు అందేవి. మిల్లు మూతపడే నాటికి కనీస మూల వేతనం 26 రోజులకు రూ.537.50పైసలు ఉండేది. కరువు భత్యం రూ.4,411. ఈ మొత్తానికి 5శాతం ఇంటి అలవెన్స్ కలిసేది. మిల్లుల్లో టైమ్ రేటు డిపార్ట్‌మెంట్లు జ్యూట్, బేచింగ్, రోవింగ్, స్పిన్నింగ్, మెకానిక్ విభాగాలు ఉండేవి. పీస్ రేటు డిపార్ట్ మెంట్లు వైండింగ్, భీమింగ్, మగ్గాలు, కుట్టు ఉండేవి.

షిఫ్టులను కుదించి లాకౌట్

కరెంట్ కోతను సాకుగా చూపిన యాజమాన్యం షిఫ్టులను కుదించింది. అప్పటి వరకూ కొనసాగే మూడు షిఫ్టులను రెండు షిఫ్టులకు కుదించింది. ఈ పద్ధతిని కార్మికులు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. దీన్ని సుతరామూ అంగీకరించని యాజమాన్యం మిల్లును 2009 ఏప్రిల్ 20న లాకౌట్ వేసింది. ఇందులో పని చేసే కార్మికులు రోడ్డున పడ్డారు.

చట్ట విరుద్ధంగా మిల్లు మూత

లాకౌట్ అక్రమమని ఓ వైపు కార్మికులు, మరో వైపు న్యాయ స్థానం చెప్పినప్పటికీ, యాజమాన్యం పెడచెవిన పెట్టింది. పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు.

నైపుణ్యం గల కార్మికులు.. అంతే స్థాయిలో ఉత్పత్తి

చిట్టివలస జ్యూట్ మిల్లుల్లో ఎంతో నైపుణ్యం గల కార్మికులు ఉండేవారు. దీంతో ఉత్పత్తిలో కూడా అంతే నైపుణ్యం ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో అత్యధిక గోనె సంచుల తయారీ జరిగేది. దేశ విదేశాల్లో ఇక్కడి గోనె సంచులకు మంచి డిమాండ్ ఉండేది.

మాట తప్పిన పాలకులు..

తమను ఎన్నికల్లో గెలిపిస్తే చిట్టివలస జ్యూట్ మిల్లును తెరిపిస్తామంటూ ఈ 14 ఏళ్ల కాలంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు ఇచ్చిన మాటను నిలబెట్టు కోలేదు.

చెట్టుకొకరు.. పుట్టకొకరు

జ్యూట్ మిల్లు మూతపడటంతో ఇక్కడ పనిచేసిన కార్మికులు చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెదిరిపోయారు. ఇక్కడకి సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశాఖలో వివిధ సంస్థలు, పరిశ్రమల్లో చాలీచాలని జీతాలతో సెక్యూరిటీ గార్డులుగా, చిరుద్యోగులుగా పని చేస్తున్నారు. మరోవైపు రోజు కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు.



శిథిలమైన క్వార్టర్లు

శిథిల క్వార్టర్లలోనే నివాసం

చిట్టివలస జ్యూట్ మిల్లులో పనిచేసే కార్మికులు, వారి కుటుంబాలతో కొత్తపేట, విల్సన్‌పేట, చిట్టివలస జ్యూట్ క్వార్టర్లలో నివాసముండేవారు. కొత్తపేటలో దాదాపు 500 కార్మిక కుటుంబాలు నివాసం ఉండేవి. మిల్లు మూతపడిన అనంతరం ప్రస్తుతం కేవలం 120 కుటుంబాలు మాత్రమే నివాసముంటున్నాయి. యాజమాన్యం తాను అనుకున్నట్లుగా కొంత మందికి మాత్రమే చెల్లింపులు చేయడంతో అనివార్యంగా క్వార్టర్లను ఖాళీ చేసినట్లు కొందరు కార్మికులు చెబుతునానరు. శిథిల క్వార్టర్లలో ఉండలేక ఖాళీ చేసినట్లు మరికొందరు చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులు

నా భర్త జ్యూట్ మిల్లులో పనిచేసి 2009లో రిటైర్ అయ్యారు. 2012లో అనారోగ్యంతో చనిపోయారు. నాకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నా కుమారుడు కూడా జ్యూట్ మిల్లు లో 3నెలల పాటు అప్రెంటిస్‌గా పనిచేశాడు. మిల్లు మూత పడడంతో చాలీ చాలని జీతానికి నగరంలో సెక్యూరిటీ గార్డుగా చేస్తున్నాడు. శిథిల క్వార్టర్లలోనే ఉంటున్నాను.



వి.రాంభాయి
కొత్తపేట

సెక్యూరిటీ గార్డుగా చేరాను

జ్యూట్ మిల్లు మూతపడిన తర్వాత నగరంలో ఓ సంస్థలో సెక్యూరిటీ గార్డుగా చేరాను. నెలకు ఇచ్చే రూ.14 వేలులో బస్ పాస్, ఇతర ఖర్చులు పోను సుమారు రూ.10వేలు చేతికి వస్తోంది. పెరిగిన ధరలతో ఈ జీతం ఏమాత్రం చాలడంలేదు.



సిహెచ్.వెంకటరమణ(47)
జ్యూట్ కార్మికుడు
కొత్తపేట

అరకొర వేతనాలతో అవస్థలు

ఓ ప్రైవేట్ సంస్థలో సెక్యూరిటీ గార్డుగా నెలకు రూ.9 వేలు వేతనానికి పని చేస్తున్నాను. ఓ వైపు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో వచ్చే అరకొర వేతనం ఏమాత్రం చాలడం లేదు. అయినా ఏదో అలా జీవనం సాగిస్తున్నాం.



ఎం.అప్పలరాజు (62)
జ్యూట్ కార్మికుడు
కొత్తపేట



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా..

14 నుంచి క్షేత్రస్థాయి ఆందోళన

ప్రజాశక్తి -తగరపువలస : కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ, సిపిఎం ఆధ్వర్యాన క్షేత్ర స్థాయి ప్రచారం, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమైందని విమర్శించారు. బిజెపి మతోన్మాద విధానాలు ఫెడరలిజానికి, సెక్యులరిజానికి పెను ముప్పుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు, పోలవరం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు వంటి ప్రధాన సమస్యలపై ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకు ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. తగరపువలసలో ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని, స్థానిక జంక్షన్ మీదుగా ఆర్టీసీ బస్సులు నడపాలని, రైతు బజారు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అల్లు బాబూరావు, కానూరి రాంబాబు, నూలు ఆదినారాయణ, ఎం.అప్పలరాజు, ఎం.సన్యాసిరావు, అల్లం గోవిందరావు, ఎం.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి

స్వాతంత్ర్య సమర యోధులు, వీర తెలంగాణ పోరాటంలో అగ్ర భాగాన నిలబడి విజయవంతం చేసిన చంద్ర రాజేశ్వరరావు అందించిన సేవలు, త్యాగం మరువలేనిదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేరాలు ఘోరాలు

మేఘాద్రిలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-పెందుర్తి : మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో స్నానానికి దిగిన నిఖిల్ (20) గల్లంతయ్యాడు. మాకవరపాలేనికి చెందిన 8 మంది యువకులు మద్యం తాగడానికి రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. మద్యం తాగిన అనంతరం స్నానానికి దిగారు. ఈ క్రమంలో నిఖిల్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాలతో గాలింపు చేపట్టారు.

గంజాయి స్వాధీనం : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు పక్కన నేరెళ్లవలస కాలనీ సమీపంలో గంజాయి తాగేందుకు సిద్ధపడిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 3వ వార్డు ఎగువపేటకు చెందిన రౌడీషీటర్ మేరుగు సతీష్ (25), కుప్ప రాకేష్ కుమార్ (19) గంజాయి తాగేందుకు సిద్ధపడ్డారు. దీనిపై పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 900 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు సిఐ కె.లక్ష్మణమూర్తి, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రమణ తెలిపారు.

కత్తితో దాడి : ఒకరికి గాయాలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ బోయపాలెం కూడలిలో మటన్‌షాప్‌లో పనిచేస్తున్న వ్యక్తి కత్తితో దాడి చేయగా ఒకరు గాయపడ్డారు. మటన్ షాపులో పనిచేస్తున్న రెహమాన్ (33) స్థానికంగా ఉన్న తిరుపతి(23) సరదాగా మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో తిరుపతి ఆదివారం రెహమాన్‌తో ఎగతాళిగా మాట్లాడాడు. దీంతో రెహమాన్ కోపోద్రిక్తుడై తిరుపతి మెడపై కత్తితో గాయపరిచాడు. మెడపై తీవ్రమైన గాయమైన తిరుపతిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : భర్త కనిపించడం లేదని పద్మనాభం పోలీసులకు ఆదివారం ఆయన భార్య ఫిర్యాదుచేశారు. దీనికి సంబంధించి పద్మనాభం ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కథనం ప్రకారం... మండల కేంద్రమైన పద్మనాభం పంచాయతీ పరిధిలో ఉన్న ఇసుకలపాలెం గ్రామానికి చెందిన లంకలపల్లి అప్పారావు (70) ఈ నెల 4వ తేదీ నుంచి కనిపించడం లేదు. బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో భార్య పుష్ప ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.



వంట సామాగ్రితో ప్రతినిధులు

వంట సామగ్రి వితరణ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం నేలతేరులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు విశాఖపట్నం వాల్తేర్ రౌండ్ టేబుల్ ఎన్జీవోస్ బృందం వంట సామాగ్రి, గ్యాస్‌స్టవ్, విద్యార్థులకు ఆట వస్తువులు అందజేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించడానికి క్రీడా సామాగ్రి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్జీవోస్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ బృందం సభ్యులు అంకిత్, విజయ్, కస్తూరిబా గాంధీ ప్రత్యేకాధికారి చంద్రకళ పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారునికి సత్కారం

ప్రజాశక్తి -మధురవాడ : ఇటీవల సెర్బియాలో జరిగిన పీపుల్ విత్ డిసబిలిటీ విభాగంలో ఇంటర్నేషనల్ చెస్ ఒలింపియాడ్‌లో కాంస్య పతకం సాధించిన ఎరిగెల నవీన్ కుమార్‌ను ఎండాడలోని భీమిలి జనసేన పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా భీమిలి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల మాట్లాడుతూ, సంకల్పం ఉంటే మానసిక వైకల్యం దేనికి అడ్డురాదన్నారు. వికలాంగులు మానసికంగా కృంగిపోకుండా ఎన్నో విజయాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బివి.కృష్ణయ్య, శాఖరి శ్రీనుబాబు, ఇఎన్ఎస్ చంద్రరావు, నాగోతి నాయుడు, పోతిన అనురాధ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యాన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, వివాదాలు, సెటిల్‌మెంట్లలో తలదూర్చవద్దని సూచించారు. క్రమశిక్షణతో మెలగాలని, అనవసర విషయాల్లో కలగజేసుకోకుండా ఉండాలని హితవు పలికారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హంసవాహనం తయారీకి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-పద్మనాభం : అనంతుని హంస వాహనం తయారీకి విశాఖపట్నానికి చెందిన శివాజీరావు దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం కుంతీమాధవస్వామి ఆలయంలో పురోహితులు సీతారామాంజనేయులు, ఎంపిపి కె.రాంబాబుకు అందించారు.



నటుడు కల్యాణ్‌రామ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అభిమానులు

కల్యాణ్‌రామ్‌ను కలిసిన బాలకృష్ణ అభిమానులు

ప్రజాశక్తి- ములగాడ నగరంలో డేవిడ్ చలనచిత్రం షూటింగ్ నేపథ్యంలో నటుడు కల్యాణ్‌రామ్‌ను పారిశ్రామిక ప్రాంతం బాలకృష్ణ అభిమానులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నటుడు కల్యాణ్ రామ్ అభిమానులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ అభిమానులు నమ్మి గౌరీశ్వరరావు, సన్నీ యాదవ్, దాడి బాలకృష్ణ, సిహెచ్.రాము, తారక్, ఎం.గణపతి, యుఎస్‌వి.ప్రసాద్‌శర్మ, మురళీకృష్ణ, సోమేష్, జిఎస్.గురునాథం, కొండలరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడలోని దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.40 లక్షలతో టి.నగరపాలెంలో నిర్మించిన సామాజిక భవనాన్ని సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమతో కలిసి స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం అదే పంచాయతీ గొల్లలపాలెంలో రూ.15లక్షలతో నిర్మించ తలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, ఎంపిడి, ఎం.వెంకటరమణ, వైసిపి నాయకులు చంద్రశేఖర్, సన్యాసిరావు, సిఎస్ఆర్ ప్రతినిధులు నాగరాజు, వరహాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 33వ వార్డు పరిధి అల్లిపురంలోని కోదండ రామస్వామి దేవస్థానం నందు శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు దక్షిణ నియోజకవర్గ వైసిపి నాయకుడు సీతంరాజు సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సుమారు 5000 మందికి అన్నదానం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పచిరపల్లి రాము, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకుటి నారాయణరావు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, శ్రీనివాసరెడ్డి, వైసిపి కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.



అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న సీతంరాజు సుధాకర్

వైసిపి సమావేశాలకు రాకుంటే రుణమాఫీ కట్

మహిళలను బెదిరిస్తున్న డ్వాక్రా ఆర్పీలు

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో ఏ సమావేశాలు జరిగినా అధికార పార్టీ బలం చూపెట్టుకోవటానికి డ్వాక్రా మహిళలను పావులుగా వాడుకుంటున్నారు. డ్వాక్రా మహిళలంతా సమావేశాలకు తప్పనిసరిగా రావాలని, లేకుంటే ఆసరా రుణమాఫీ తదితర పథకాల నిధులు జమ చేయబోమని ఆర్పీలు భయాందోళనకు గురి చేస్తున్నారు. ఎక్కడ సమావేశం జరిగినా పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి మహిళలను తరలిస్తున్నారు. ఈ సమావేశాలకు హాజరుకావడం వల్ల కూలి పనులు మానుకోవాల్సి వస్తోందని కొంతమంది మహిళలు వాపోతున్నారు. ఒక రోజు పనికి వెళ్లకుండా మరుసటి రోజు వెళ్తే రావద్దని కాంట్రాక్టర్లు వెనక్కిపంపుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పలు కుటుంబాల మహిళలకు వైసిపి సమావేశాలు గుదిబండలుగా మారుతున్నాయి. సమావేశానికి హాజరుకాకపోతే పథకాలు వర్తించవని ఆర్పీల బెదిరింపులు, మరోవైపు కూలి పనికి వెళ్లకపోతే తీసేస్తామని కాంట్రాక్టర్ల బెదిరింపుల మధ్య మహిళలు అల్లాడుతున్నారు.

కాపు కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి-గోపాలపట్నం : నేవల్ డాక్‌యార్డు ఉద్యోగులు తమ సొంత నిధులతో కాకానినగర్ జంక్షన్ వద్ద నిర్మించిన కాపు సామాజిక భవనాన్ని ఆదివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత నిధులతో కాపు సామాజిక భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల సమిష్టి కృషి వల్ల ఈ నిర్మాణం జరిగిందన్నారు. భవిష్యత్తులో తన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ, రూ.ఐదు కోట్లు వ్యయంతో నిర్మించిన ఈ భవనం కాపు సామాజి వర్గానికి అన్ని విధాలా ఉపయోగపడుతుందన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు మాట్లాడుతూ, సొంత నిధులతో నిర్మించిన ఈ భవనం పూర్తి హక్కులు వారికే ఉంటాయన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం కాపులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు చిరంజీవి, భాస్కరరావు, బిజెపి నేత జనపరెడ్డి పృథ్వీరాజ్, విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, కాపు సామాజిక వర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆత్మరక్షణకు బాక్సింగ్ దోహదం

ప్రజాశక్తి- ములగాడ : బాక్సింగ్ శిక్షణ ఆత్మ రక్షణకు ఎంతగానో దోహదపడుతుందని 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్, స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ పేర్కొన్నారు. శ్రీహరిపురం ఎంబిజి క్వార్టర్స్ మైదానంలో మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత బాక్సింగ్ సమ్మర్ క్యాంపు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాక్సింగ్ ద్వారా శారీరక ఆరోగ్యం ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ బాక్సర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి సోమేష్, ఐఎన్‌టియుసి నాయకులు భోగవిల్లి నాగ భూషణం, పూడి మల్లేశ్వరరావు, మాత వెంకటరమణ, రైల్వే బాక్సర్లు దుర్గ, నర్సింగ్, టైసన్ రామారావు, హరి, ఆర్మీ ప్రసాద్‌పాత్రుడు, షైక్ అలి తదితరులు పాల్గొన్నారు.



బాక్సింగ్ శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న పీవీ సురేష్ తదితరులు

10న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : మధురవాడ జోన్-3 కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన ఉదయం 10.30 గంటలకు విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ అపరేషన్ జోన్-3 ఇఇ పి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలి మండల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ సమస్యలను పరిష్కార వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

మే డేను సెలవుగా ప్రకటించాలి

ప్రజాశక్తి -సీతమ్మధార : మే డేని సెలవు దినంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మే డేని సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అక్కయ్యపాలెం హైవే జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్ల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మే డేని సెలవు దినంగా ప్రకటించి కార్మిక హక్కులను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను ఆపాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, రాత్రివేళ మహిళా కార్మికులతో పనులు చేయించే విధానం రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేలం శివ, కె.సత్తిబాబు, సిహెచ్ శంకరరావు, రావి కృష్ణ, పి.బాలు, జి.నందీశ్వరరావు, కె.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి -కంచరపాలెం : రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని జీవీఎంసీ 53వ వార్డు పరిధి మర్రిపాలెం మసీదులో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన హలీమ్‌ను అందించారు. ఈ విందులో మసీదు ఈ అల్ ఫత కమిటీ సభ్యులు, ఆర్మీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పలు చోట్ల చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-యంత్రాంగం

వేసవి తీవ్రత పెరగడంతో విశాఖ నగరంలో పలుచోట్ల ఆదివారం చలివేంద్రాలను ఏర్పాటుచేశారు.

ములగాడ : కీర్తిశేషులు బాయిన శ్రీనివాసరావు, దాసరి పైడిరాజు జ్ఞాపకార్థంగా వారి స్నేహితులు మల్కాపురం ప్రధాన కూడలి వద్ద ఆదివారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. టిడిపి నాయకులు మజ్జి సోమేష్ ముఖ్యఅతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. భిక్షగాళ్లు, పేదలకు భోజనం పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోస అప్పలరెడ్డి, శంకరరావు, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

అరిలోవ : 12వ వార్డు పరిధి చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయం ప్రాంగణంలో వైసిపి సీనియర్ నాయకులు ఇజ్జాడ సత్యనారాయణ ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం ఆదివారం ఏర్పాటుచేశారు. అరిలోవ సిఐ సోమశేఖర్, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణిరామన్ హాజరై మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పారిపల్లి రామారావు, మంగరాజు, వైసిపి సీనియర్ నాయకులు విక్టర్, వానపల్లి ఈశ్వరరావు, సత్యాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన చలివేంద్రాన్ని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ప్రారంభించారు. సనపల సూర్యనారాయణ జ్ఞాపకార్థం అతని కుమారుడు సనపల శ్రీకాంత్ ఆర్థిక సహాయం అందించారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడాలంటూ మాధవ యోజన సమాజం ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ, వైసిపి మహిళా నాయకులు పేడాడ రమణికుమారి, 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్, మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్ గోపాల్‌రావు, 50వ వార్డు బిజెపి అధ్యక్షులు తమ్మినేని పద్మజ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు, నంబాల ఈశ్వరరావు, సనపల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



చినగదిలిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న అతిథులు

పెందుర్తి : నరవ గ్రామంలో జనసేన ఆధ్వర్యాన డొక్కా సీతమ్మ పేరుతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం దోహదపడుతుందని జనసేన నాయకుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'రియల్'కు రెవెన్యూ సహకారం?

దర్జాగా గెడ్డ కబ్జా



ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఉన్నా వైసిపి నేతలు వేసిన రోడ్డు

- వాగును తవ్వేసి రోడ్డు వేసిన వైసిపి నాయకులు
- హెచ్చరిక బోర్డు పెట్టి చేతులు దులుపుకున్న అధికారులు

ప్రజాశక్తి - పరవాడ : అధికార పార్టీ వాళ్లమైన తమను ఎవరేమి చేస్తారన్న ధీమాతో వైసిపి నాయకులు దర్జాగా కబ్జాలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల సహకారం కూడా పుష్కలంగా ఉండడంతో వీరు మరింత రెచ్చిపోతున్నారు. మండలంలోని పెదముషిడివాడ రెవెన్యూలో స్థానిక వైసిపి నాయకులు గెడ్డవాగును ఆక్రమించి, తవ్వేసి రోడ్డు వేయడమే ఇందుకు నిదర్శనం. పెదముషిడివాడ రెవెన్యూ సర్వే నెంబరు 100లో 62 సెంట్లు విస్తీర్ణం గల గెడ్డవాగు ఉంది. ఈ గెడ్డ వాగుకు ఆనుకొని ఉన్న జిరాయితీ భూముల్లో రియల్ ఎస్టేట్ ప్లాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. లంకెలపాలెం-సబ్బవరం రోడ్డుకు దగ్గరిగా ఉన్న ఈ భూమిలోకి వెళ్లడానికి స్థానిక వైసిపి నాయకుడు గెడ్డ వాగు గట్టును పూర్తిగా తవ్వేసి, గెడ్డను ఆక్రమించి చదును చేసి రోడ్డు ఏర్పాటు చేశారు. గెడ్డవాగును చిన్న పిల్ల కాలువగా ఉంచారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారొచ్చి ఆక్రమణదారులకు అనుకూలంగా 'పాము చావకూడదు కర్ర ఇరక్కూడదు' అన్న సామెత మాదిరిగా పక్కన పిల్ల కాలువగా వదిలేసిన చోట బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఇది చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. రెవెన్యూ చర్యలు విడ్డూరంగా ఉన్నాయని, ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులే కొమ్ము కాస్తున్నట్లుగా ఉందని అటుగా వెళుతున్న స్థానిక రైతులు చర్చించుకుంటున్నారు. ఆక్రమించి వేసిన రోడ్డు మధ్యలో హెచ్చరిక బోర్డు పెట్టడం, వేసిన రోడ్డును తవ్వివేయడంతో పాటు గెడ్డవాగు కబ్జాపై కేసు పెట్టాల్సి ఉంది. కాని రెవెన్యూ అధికారులు ఇవేమీ చేయకపోవడంతో ఈ కబ్జాకు రెవెన్యూ అధికారుల సహకారం ఉందన్న ఆరోపణలకు బలం చేకూరుతుంది. సహజసిద్ధంగా ఉన్న చెరువులు, వాగులు, గెడ్డలు కుదించుకుపోయే విధంగా ఎటువంటి మార్పులు చేపట్టకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఉండగా, అందుకు విరుద్ధంగా అధికార పార్టీ రియల్ వ్యాపారులకు స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారం అందివ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల తహశీల్దారు వి.ప్రకాశరావును వివరణ కోగా, హెచ్చరిక బోర్డు పెట్టినట్లు చెప్పారు. ఇప్పటికైనా రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి గెడ్డవాగు గట్టును తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టిన వారిపై వాల్టా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, రోడ్డును తొలగించి గెడ్డ వాగును కాపాడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

చంద్ర ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి -అనకాపల్లి : స్వాతంత్ర్య సమరయోధులు, తొలి తరం కమ్యూనిస్టు నేత, భూ పోరాట యోధులు, సిపిఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డు గ్రహీత చండ్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. ఆదివారంకామ్రేడ్ రాజేశ్వరరావు 29వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ భూ పోరాటం చేసి పేదలకు భూములు అందించడంలో చండ్ర రాజేశ్వరరావు విశేష కృషి చేశారన్నారు. తన సొంత ఆస్తులను పేదలకు పంచిన మహోన్నత నేత రాజేశ్వరరావు అని కొనియాడారు. మతోన్మాద వ్యక్తులకు బుద్ధి చెప్పేందుకు జన సేవాదళ్ ఏర్పాటు చేసి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారన్నారు. తెలంగాణ పోరాటానికి అండగా నిలబడ్డ పోరాట యోధుడు రాజేశ్వరరావు అన్నారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు కే శంకర్రావు, వియ్యపు రాజు, కొండూరు రవీంద్ర, రమణ, నరాలశెట్టి సత్యనారాయణ, సామాజిక హక్కుల వేదిక నాయకులు పప్పల ఈశ్వరరావు, డొక్కరి మోహన్ పాల్గొన్నారు.

పేదల సేవలో వాసవి క్లబ్



ఎదలకు ఆర్థిక సహాయం అందిస్తున్న రమేష్ గుప్తా

ప్రజాశక్తి. -అనకాపల్లి : మిత్ర కెసిజిఎఫ్, అనకాపల్లి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కుమ్మర వీధి నందీశ్వరుని ఆలయం వద్ద ఆదివారం వాసవి క్లబ్ సమావేశం నిర్వహించారు. వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ గుండా రమేష్ గుప్తా పాల్గొని ఐదుగురు పేదలకు పేదలకు ఒక్కొక్కరికీ రూ.200 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదలకు సేవా కార్యక్రమాలకు ఈ సందర్భంగా సూర్యరవితేజ, బొగ్గారపు కల్యాణ్ రూ.ఐదు వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బండారు సతీష్, వెంకటరమణ, సతీష్‌కుమార్, జోన్ చైర్మన్ రాము, మెంబర్స్ నాగేశ్వరరావు, మూర్తి, ఫణి, వేణు, రంగబాబు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నా క్యాంటీన్లు తెరిపిస్తాం: పీలా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి- అనకాపల్లి : టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నా క్యాంటీన్లను తెరిపిస్తామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని పిసినికాడ గ్రామంలో కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత టిడిపి శ్రేణులపై ఉందన్నారు.

జగన్ నిరంకుశ పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను తెలియజెప్పి, మరో అవకాశం ఇస్తే రాష్ట్ర భవిష్యత్ అంధకారమౌతుందని వివరించి చెప్పాలన్నారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు నిత్యవసర వస్తువులు ధరలు కొనలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కు టిడిపి అధికారంలోకి రావడం, చంద్రబాబు సిఎం కావాల్సిన అవసరాన్ని తెలియజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్ల బాల శ్రీను, దాడి బాల, మల్ల అప్పారావు, గ్రామ పార్టీ నాయకులు దాడి లక్ష్మణరావు, ఆడారి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం దుర్మార్గం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి
- నిర్లక్ష్యంగా రోడ్లపైనే ఫార్మా వ్యర్థాలు
- బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్న కంపెనీలు



లంకెలపాలెం వద్ద రోడ్డుపైనే పారబోసిన ఫార్మా వ్యర్థం

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ రాంకీ ఫార్మసిటీలోని వివిధ కంపెనీలు బహిరంగ ప్రదేశాల్లో విషపూరిత రసాయన వ్యర్థాలను ట్యాంకర్లతో తీసుకొచ్చి విడిచిపెడుతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం లంకెలపాలెం సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో రోడ్లపై, రోడ్లు పక్కల్లో ఫార్మా కంపెనీలో పారబోసిన వ్యర్థాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఫార్మా యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లంకెలపాలెం సమీపంలో రోడ్లు పక్కన విష రసాయన వ్యర్థ పదార్థాలను విడిచి పెట్టడం వలన పిల్లలు, వృద్ధులు, తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, వాంతులు, తల తిరగడం, కళ్లు మంటలు, కళ్లు ఎర్రబడడం వంటి అస్వస్థతతో బాధపడుతున్నా రన్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి, ప్రజారోగ్యశాఖలు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి, ప్రజారోగ్యం దృష్ట్యా, రోడ్లపైనా, పక్కల్లో పారబోసిన రసాయన వ్యర్థాల నమూనాలను సేకరించి, వాటిని విశ్లేషించడం ద్వారా బాధ్యులైన కంపెనీలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లంకెలపాలెం, పరిసర గ్రామాల నుంచి ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి, వారిని చైతన్యపరిచి ఆందోళన చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 543 మందికి కంటి పరీక్షలు



వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న దొరైస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా ఆపెరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 104వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 543 మంది కంటి రోగులను వైద్యులు పరీక్షించారు. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు శిబిరంలో పాల్గొన్న బ్రాండిక్స్ పార్టనర్ దొరస్వామి వెల్లడించారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని, రోగులను పరీక్షించారు.353 మందికి ఉచిత అద్దాలను కంటి అద్దాలను పంపిణీ చేశారు. మరో 19 మందికి కంటిమందులు అందజేశారు. 32 మంది కంటి రోగులకు క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బ్రాండిక్స్ ఇండియా పార్ట్నర్ దొరస్వామి స్వయంగా పర్యవేక్షించారు. శిబిరానికి విచ్చేసిన కంటి రోగులను ఆప్యాయంగా పలకరించారు. కంటి రోగులకు తాగునీరు మజ్జిగ పులిహోర భోజనం ఏర్పాట్లు చేశారు స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు బ్రాండిక్స్ అండగా ఉంటుందని దొరస్వామి స్పష్టం చేశారు.

యాదవ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షునిగా శేషు



శేషును సత్కరిస్తున్న యాదవ సంఘం నేతలు

ప్రజాశక్తి - అనకాపల్లి : జాతీయ యాదవ్ హక్కుల పోరాట సమితి అనకాపల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా కరక శేషు యాదవ్‌ను ఆదివారం నియమించారు. ఆదివారం అనకాపల్లి విజయ రెసిడెన్సీలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ యాదవుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి సంఘం తరపున కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వియ్యపు భూలోక నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు వర్కింగ్ ఇసరపు శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుకుండు వీరేంద్ర యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మండెం చంద్రబోస్ చేతుల మీదుగా కరక శేషుకు నియామకపత్రాన్ని అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మిస్కా రమణ, పంచదార శ్రీను, కుండలు చంటి, బొట్ట నాగప్పరావు, లండ అప్పన్న, సర్వసిద్ధి తాతారావు, వెదురు తాతారావు, వేదురి ఆదిలక్ష్మి యాదవ్, నేతలు, యాదవ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో మల్లీలమ్మ తీర్థం

ప్రజాశక్తి- కె. కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామం శివారు గరుగుబిల్లి గ్రామంలో బంటు వారి కల్లాల వద్ద ఉన్న మల్లీలమ్మ తీర్థం ఆదివారము గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు తీసుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. మహిళల చిడతలు, భజనలు, తప్పెటగుళ్లు, ఇతరత్రా సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో సందడి నెలకొంది. రాత్రికి సాంఘిక నాటకం ప్రదర్శించారు కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొన్నారు.

అడ్డుగోడ కూల్చేందుకు అడ్డగోలు యత్నాలు!


- దేవుడి భూమికి శఠగోపం పెట్టేందుకు కుయుక్తులు
- రాజకీయాల జోక్యంతో ముందుకు సాగని పన్నాగాలు
- ఇదే అదనుగా లక్షల్లో దండుకుంటున్న మధ్యవర్తులు



దేవాదాయశాఖ భూమికి అడ్డుగా ఉన్న ప్రహరీ

ప్రజాశక్తి - యలమంచిలి : దేవాదాయశాఖకు యలమంచిలి మెయిన్‌రోడ్డును ఆనుకొని విలువైన స్థలం ఉంది. దాన్ని రోడ్డుగా మలచడానికి పదిహేనేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తమ స్థలానికి దేవాదాయశాఖ ప్రహరీ నిర్మించుకుంటే దాన్ని తెలుగుదేశం హయాంలో కూల్చేసి వెనుక నివాసం ఉన్న వారు దారిగా మార్చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చేక పోలీసుల సహకారంతో తిరిగి అడ్డంగా ప్రహరీ నిర్మించారు. దీంతో వెనుక నివాసం ఉంటున్న వారు, వ్యాపారులు కలిసి ఎలాగైనా దేవాదాయ శాఖను ఒప్పించి దారి ఏర్పాటు చేయాలని అధికార పార్టీ నేతల్ని వేడుకుంటున్నారు. భవనంవీధి, కోర్టుపేటల మధ్య వీధులు లేకపోవడంతో ఖాళీస్థలాలు ఎక్కువగా ఉండేవి. వాటిని చవకరేటు రోజుల్లో బడా వ్యాపారులు వాటిని కొనుక్కున్నారు. భూముల విలువ అమాంతం పెరిగి పోవడంతో ఖాళీ స్థలాల్లో పెద్ద పెద్ద భవనాలు వెలిసాయి. గోడౌన్లు కూడా పెరిగాయి. వ్యాపార సంస్థలు కూడా వెలిసాయి. మెయిన్‌రోడ్డుకు కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ దారి సౌకర్యం లేక అనేక అవస్థలు పడుతున్నారు. దారి సౌకర్యం ఉంటే అక్కడి భూముల రేట్లు అమాంతం రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్ని అవకాశంగా మలచుకున్న ఒక పార్టీ యువనేత ఆ దేవాదాయ భూముల్లోంచి దారి చూపే బాధ్యత తనకు వదిలెయ్యండంటూ రూ.పది లక్షలు వెనకేసుకున్నట్లు లబ్దిదారులు చెవులు కొరుక్కుంటున్నారు. ఆ యువనేత నొక్కుడు కార్యక్రమం తెలిసిన వైసిపి ఎమ్మెల్యే కన్నబాబురాజు పట్టుదలగా స్థానిక పోలీసులు, ఎండోమెంట్ డిపార్టుమెంట్ పెద్దల్ని రప్పించి దారి మూసేసి దానికి అడ్డంగా ప్రహరీ నిర్మించారు. కథ అడ్డం తిరిగి మళ్లీ మొదటికొచ్చింది. మళ్లీ మార్గం తమరే చూపాలంటూ అధికార పార్టీ నేతల్ని లబ్ధిదారులు వేడుకుంటున్నారు. ఇదే సమయంలో మరో వైశ్యనేత ముందుకొచ్చి సమస్యను సామరస్యంగా పరిష్కారించుకుందామని వెనుకనున్న స్థల యజమానుల దగ్గరనుంచి స్థలాలను బట్టి, స్తోమతును బట్టి రూ.30 లక్షలు వసూలు చేశారు. సొమ్ము వసూలు చేసి నెలలు, ఏళ్లు గడుస్తున్నా తమకు 'దారి' కానరావడం లేదని స్థల యజమానులు లబోదిబోమంటున్నారు. ప్రహరీ గోడ కూల్చడానికి ఇటీవల ఓ రాత్రి పథకం వేశారు. అది దేవాదాయ శాఖకు తెలవడంతో పోలీసులతో కాపలాపెట్టి వారి ప్రయత్నాన్ని విఫలం చేశారు. ఇదంతా చూసి వైశ్య ప్రముఖుడు మాత్రం ముఖం చాటేసినట్టు సమాచారం. దేవుడి భూమికి పంగనామాలు పెట్టబోతే తమకు దళారులు శఠగోపం పెడుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులకు మందులు అందజేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని తోటాడ గ్రామంలో ఆదినారాయణస్వామి రాజయోగాశ్రమం ట్రస్టు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఓంకార పీఠం ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ వై పైడిపతిరావు, కె దివాకరరావు, కె మానస, గుండా సుధీర్, డి అనిల్ కుమార్, పి స్వాతి, ఎన్ రాకేష్, కె శ్యాంశ్రీ, ఎం.పర్షీష్, కె తరుణ్, జి మానసశ్రీ తదితరులు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక రోగాలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. తోటాడ, సిరసపల్లి, నారాయుడుపాలెం, గవర్ల అనకాపల్లి పరిసర గ్రామాల నుంచి వచ్చిన 230 మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులను ట్రస్ట్ ప్రతినిధులు సత్కరించారు. మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుశాంత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి, దొడ్డి కోటేశ్వరరావు, దొడ్డి బాలాజీ, మద్దాల వీరు నాయుడు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన

ప్రజాశక్తి - పరవాడ: విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా మాజీ మంత్రి బండారు సత్యన్నారాయణ మూర్తి, పరవాడ మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పరవాడ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా, ఆందోళన నిర్వహించనున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించే ధర్నాలో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు మండల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గ్యాస్ మాదిరిగా నెలవారీ విద్యుత్ బిల్లుల సవరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై ప్రజలంతా ప్రతిఘటించాలని కోరారు.

యువత స్వచ్ఛందంగా రక్తదానం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న బ్రాండిక్స్ దొరస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపరల్ సిటీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం బ్రాండిక్స్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న వారికి తిరిగి పునర్జన్మ కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. రక్తదాన కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. బ్రాండిక్స్ చేపట్టిన రక్తదాన కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ సహాయ సహకారాలు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 15 మంది యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తాన్ని దానం చేయగా, వారిని దొరైస్వామి అభినందించారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- అనకాపల్లి : కొత్త అమావాస్య జాతర మహోత్సవంలో భాగంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం అధికసంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి జిల్లా నలుమూలల నుంచి కుటుంబాలతో సహా వచ్చిన భక్తులుఅమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు తీర్చుకున్నారు. మూడవ ఆదివారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఆలయం వద్ద భక్తుల వంటావార్పులతో సందడి నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఇఒ బండారు ప్రసాద్, దేవాదాయ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత, పట్టణ సిఐ దాడి మోహనరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.

'రుషిల్' కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం



దీక్షలో పాల్గొన్న నిర్వాసిత మురా కార్మికులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఐదు రోజులుగా బాధిత రిషిల్ నిర్వాసిత మురా కార్మికులు ధర్నా చేస్తున్నా, అధికారులు గానీ యాజమాన్యం గాని పట్టించుకోక పోవడం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము అన్నారు. దిబ్బపాలెం గ్రామంలో రుషిల్ డెకార్ ప్లాస్టిక్ ప్లైవుడ్ పరిశ్రమ ఆవరణలో మురా కార్మికులు చేపడుతున్న దీక్షలు ఐదో రోజైన ఆదివారం దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిర్వాసితుల సమస్యలపై సానుకూలంగా స్పందించకుండా, పాలకుల నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెజ్ పరిశ్రమలలో పనిచేస్తున్న మురా కార్మికులంతా తమ సమస్యల పరిష్కారానికి సమిష్టి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపిన ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, భూములు కోల్పోయి బతుకుతెరువు కోసం పరిశ్రమలలో పనిచేస్తున్న నిర్వాసితులను వేధించడం సరైన విధానం కాదని ఆవేదన చెందారు. దీక్ష శిబిరంలో పాల్గొని, కార్మికులతో కూర్చొని మురా కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సెజ్ నిర్వాసితులతో ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యాలు కుదుర్చుకున్న ఒప్పందాన్ని కొనసాగించాలన్నారు. ఉపాధి అవకాశాలను కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, సెజ్ నిర్వాసితుల పునరావాస కాలనీ అభివృద్ధి కమిటీ నేత బయలపూడి రామదాసు, మురా కార్మికుల ప్రతినిధి గొర్లి సత్తిబాబు, జనసేన ప్రతినిధి పైలా రామానాయుడు పాల్గొన్నారు

దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యం మేలు



ఆయుర్వేద సదస్సులో మాట్లాడుతున్న దొరమ్మనాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆయుర్వేదంలో జీవన విధానం ద్వారా పలు దీర్ఘకాలిక, తక్షణ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని పతంజలి యోగ సమితి, విశ్వ ఆయుర్వేద పరిషత్, భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు బిశెట్టి దొరమ్మనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన ఆయుర్వేద సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సుందర్ రాజ్ పెరుమాళ్ళు అత్యంత క్లిష్టమైన వ్యాధుల కారకాలను, నివారణ మార్గాలను వివరించారు. అలాగే ఆయుర్వేద పంచకర్మ చికిత్స విధానం, యోగ ప్రాణాయామం, ధ్యానం ద్వారా పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని సూచించారు. జీవన విధానం మార్చుకోవడం ద్వారా కూడా పలు జబ్బులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఆరోగ్యధాత్రి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 21 వరకు జరిగే ఉచిత ఆయుర్వేద యోగ శిక్షణ సప్తాహం, అలాగే ఈనెల 29 నుంచి మే 1 వరకు జరిగే జీవన విద్య వర్క్ షాప్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మళ్ల నరసింగరావు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కొలపర్తి కన్నబాబు, కొణతాల శివాజీ, రామకష్ణ, గణేష్, ఆడారి దేవకి పాల్గొన్నారు.

ఘనంగా బండిమాంబ పండగ

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ యాతపాలెం గ్రామ దేవత బండిమాంబ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి దర్శించు కొని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చారు. టిడిపి నేత భరణికాన బాబూరావు, గండి రవికుమార్, గండి ముత్యాల నాయుడు, గండి దేముడు, బొండా సత్యారావు, కోటాన అప్పారావు, ఆడారి నాగరాజు, మళ్ల వెంకటరమణ, గవర అప్పారావు, సీరం అప్పలరాజు, ఆకుల గణేష్, పొట్నూరు అప్పారావు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' వైద్యసేవలను పరిశీలించిన డిఎంహెచ్ఓ



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ హేమంత్

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహణను జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ. హేమంత్ పరిశీలించారు. మొగలిపురంలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహణ, ప్రయోజనాలపై స్థానికులను అడిగితెలుసుకున్నారు. అనంతరం మల్లునాయుడు పాలెంలో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని, గుల్లేపల్లిలో నాడు నేడు పథకంలో అదనపు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. గుల్లేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. సబ్బవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, పరిసర అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. గుల్లేపల్లి, సబ్బవరం పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ ఎన్‌వి రమణ, డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది ఫార్మసిస్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసిపి ఇంటిబాట ఖాయం

ప్రజాశక్తి- మునగపాక రూరల్: రాష్ట్రంలో ప్రజాకంటక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని, ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిఉన్న ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో జనవాణి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వ్యాపారానికి తప్ప ప్రజలకు సేవలు అందించలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపే రోజులు దగ్గర పడతాయన్నారు. రానున్న ఎన్నికలలో తాను ఎమ్మెల్యేగా గెలిచి, నియోజకవర్గం అభివద్ధికి పాటుపడతానని ఆశాభావం వ్యక్తం చేశారు కార్యక్రమంలో జనవాణి నియోజకవర్గ కన్వీనర్ పైల అప్పలనాయుడు, మండల ఇన్‌ఛార్జి జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ టెక్కలి పరశురాం, ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, ఉపాధ్యక్షులు పొలిపిని రాము, లాలం సోమ నాయుడు, కారెడ్ల ప్రకాష్, వేణి, సరోజిని, శ్రీను, గొర్లి గోపి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 10 ఏప్రిల్ 2023

492వ రోజూ మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి : హెటిరో పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 492వ రోజుకు చేరింది. ఆదివారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు .పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, పైపులైన్‌కు వ్యతిరేకంగా తామంతా 492 రోజుల నుండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ, ఇవేమీ పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైప్ లైన్‌కు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదని, సముద్రం పై ఆధారపడి తామంతా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. సముద్రాన్ని కలుషితం చేసి తమ పొట్ట కొట్టొద్దన్నారు. తమ జీవన విధానం దృష్టిలో పెట్టుకొని కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైనుకు ఇచ్చిన అనుమతులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, వాసపల్లి స్వామి, మైలపల్లి బాబుజి, బొంది నూకరాజు, పిక్కి తాతాజీ, గోసల అంజి , పిక్కి రామ్ చరణ్, చొడిపల్లి రాజు, కారే రాజు, కారే కోదండరావు, పిక్కి కోటి, మైలపల్లి శివ, మైలపల్లి జాను, కోడా కాశీరావు, కారే సతీష్, బోగడ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న మత్స్యకారులు


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ సందర్భంగా బుక్ రీడింగ్‌ను నిర్వహించారు. అనంతరం దేశ నాయకులపై డిబేట్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల బాలికలు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలో ఆదివారం భారీ పిడుగు శబ్దాలతో వర్షం కురిసింది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతకు గురైన గిరిజనులకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. పిడుగు శబ్దాలు అధిక శబ్దాలతో రావడంతో గిరిజనులు భయాందోళనకు గురయ్యారు.

వైసిపి పాలనలో సంక్షేమానికి పెద్దపీట

-'మా నమ్మకం నువ్వే జగనన్న'లో మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - అనకాపల్లి : వైసిపి పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేశామని, అర్హులైన వారందరికీ ప్రభుత్వపరంగా లబ్ధిచేకూర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందనిరాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో జగన్‌కు ఎవరూ సాటిరారన్నారు. అవి యథాతథంగా కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఆదివారం మండలంలోని తుమ్మపాల గ్రామంలో గడపగడపకు వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.


అర్హత పత్రం పంపిణీ చెస్తున్న మంత్రి అమరనాథ్

సాయంత్రానికి పింఛను పునరుద్ధరించండి

పుట్టుక నుంచి వికలాంగుడైన తుమ్మపాలకు చెందిన బాలుడు ఎ.ప్రసన్నకుమార్‌కు ఇచ్చే పింఛనును పదేపదే రద్దు చేయడం సరికాదని, సాయంత్రానికి కల్లా పింఛను పునరుద్ధరించడంతోపాటు రెగ్యులర్‌గా అందించే చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశించారు. గతంలో తనచొరవతో మంజూరైన పింఛనును నిలిపేయడం, వికలాంగ లబ్ధిదారుడు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోకపోవడంపై ఎంపిడిఒ ధర్మారావును అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రానికల్లా పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే అవయవాలు చచ్చు బడి నడవలేని పరిస్థితుల్లో ఉన్న ఆడారి సూరిబాబుకు బ్యాటరీ వెహికల్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా గాంధీనగరంలో శిథిలావస్థలో ఉన్న ఎస్‌సి బాలుర హాస్టల్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బిసి బాలుర వసతి గహంలో రూ. రెండున్నర లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్ ను ఎంపీ డాక్టర్ సత్యవతితో కలిసి ప్రారంభించారు. రూ.40 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న తుమ్మపాల మూడవ సచివాలయ భవనాన్ని తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడ్డ 14వ వార్డు మెంబర్ కొయ్య జగది లక్ష్మి భర్త భాస్కరరావును పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, జెడ్‌పిటిసి కోఆప్స్ సభ్యులు జోసెఫ్, వైస్ ఎంపిపి విల్లూరి సూర్యకుమారి శేఖర్, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ సర్పంచు చదరం చిన్న, వార్డు సభ్యులు తర్ర సత్యారావు, కనుబుడ్డి శంకరరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : 84వ వార్డు ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో గొల్లవీధి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్నలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పలక రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ యజమానుల అనుమతితో స్టిక్కర్లను అందించారు. కార్యక్రమంలో పిల్లల శివ అప్పారావు, పూడి సూరిబాబు, మొల్లి శ్రీను, ఆవుపాటి మల్లేష్, పిల్లల అప్పల సూర్యనారాయణ, గహసారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


గొలుగొండ మండలం బుడ్డోడపాడులో ప్రచారం చేస్తున్న నేతలు

పరవాడ: మా నమ్మకం నువ్వే జగనన్నలో భాగంగా మూడవ రోజు ఆదివారం పరవాడ సచివాలయం పరిధిలో ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మీ శ్రీనివాసరావు గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామరావు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, సచివాలయం కన్వీనర్లు, వైసిపి నేతలు పైల హరీష్, చీపురుపల్లి శ్రీనివాసరావు, పైల పైడం నాయుడు, గండి మహేష్ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : వాడ్రాపల్లి గ్రామంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ తిరుగుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అడిడి తెలుసుకున్నారు. సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, గహ సారథులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని అడ్డాం గ్రామంలో సర్పంచ్ చేకూరి మహేశ్వరరాజు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రస్తుత, గత ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై పరిశీలన జరిపి, సంక్షేమ పాలన సాగిస్తున్న సిఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లిలో 'మా నమ్మకం నువ్వే జగనన్నలో భాగంగా వైసిపి నేతలు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. గోడలపై స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో కన్వీనర్ కసిరెడ్డి కృష్ణ, సీతా నాగేశ్వరరావు, పర్రె శ్రీను, వైసిపి మండల యువజన ప్రధాన కార్యదర్శి సీతా సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోపి పాతమల్లంపేట గ్రామ సచివాలయ పరిధిలో బుడ్డోడపాడు గ్రామంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ కొరుప్రోలు పాణి శాంతారామ్, మాజీ సర్పంచ్ పప్పల రమణ, వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట, సిహెచ్.నాగాపురం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత, ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ్, గృహ సారథులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శం

-ఘనంగా ఈస్టర్ వేడుకలు


ప్రార్థనలో పాల్గొన్న పీలా

ప్రజాశక్తి -అనకాపల్లి : ఏసుక్రీస్తు అందించిన శాంతి బోధన, మార్గాలు ప్రపంచానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక బర్మా కాలనీలోని మన్నా చర్చిలో పాస్టర్ శశి కుమార్ ఆధ్వర్యంలో ఈస్టర్ సండే వేడుకల్లో పాల్గొని, క్రిస్టియన్లకు ఈస్టర్ శుభాకాంక్షలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సాధికారిక సమితి కన్వీనర్ మల్ల సురేంద్ర, అర్బన్ జిల్లా కార్యదర్శి పోలవరం త్రినాథ్, 83వ వార్డు ఇన్‌ఛార్జి బొద్దపు త్రినాథ్, పీలా లోకేష్, ఆకుల నానాజీ, ఆళ్ల జగన్, శిలపరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఈస్టర్ సండే సందర్భంగా క్రీస్తు పునరుత్థానాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలతో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు.

కోటవురట్ల:మండల కేంద్రం సహా పలు గ్రామాలలో ఆదివారం క్రిస్టియన్ సోదరులు ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్టియన్స్ కి ముఖ్యమైన రోజుల్లో ఈస్టర్ రోజు ఒకటి. యేసు క్రీస్తు మూడవరోజు పునరుత్తాన్ని ఈస్టర్ గా క్రిస్టియన్స్ జరుపుకుంటారు. ఇందులో భాగంగా క్రిస్టియన్స్ బంధువుల సమాధుల వద్దకు వెళ్లి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి వాళులు అర్పించారు.


సమాధుల వద్ద నివాళి అర్పిస్తున్న క్రైస్తవులు

నాటు..నాటు...

- విచ్చలవిడిగా నాటు సారా తయారీ

ప్రజాశక్తి-మాడుగుల: గ్రామాలలో నాటు సారా ఏరులై పారుతోంది. అడ్డూ, అదుపు లేక ఎక్కడ పడితే అక్కడ నాటు విరివిగా లభిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. మండలంలోని అనేక గిరిజన గ్రామాలతో పాటు, ప్రధాన గ్రామాలలో సైతం నాటు సారా దొరుకుతుంది. భారీగా నిత్యం క్రియ విక్రయాలు జరుగుతున్నాయి. దీన్ని అరికట్టవలసిన ఎక్సైజ్ శాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది. మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలో నడుస్తుండగా, గతంలో ప్రైవేటు వ్యాపారాలు వేలం ద్వారా దుకాణాలను దక్కించుకొని వ్యాపారం నిర్వహించేవారు. ఆ సమయంలో గ్రామాల్లో నాటు సారా ఎక్కువగా ఉండటంతో తమ ఆదాయానికి గండి పడుతుందనే కారణంతో ప్రైవేట్ వైన్ దుకాణాలు ఎక్సైజ్ అధికారులతో నిరంతరం దాడులు నిర్వహించే వారు. దీంతో చాలావరకు నాటు సారా అరికట్టబడేది ప్రస్తుతం ప్రభుత్వ ఆదాయాన్ని గండిపడుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారు. గతంలో రెగ్యులర్‌గా నాటుసారా కేసులు నమోదు అవుతుండేవి. ఇటీవల కాలంలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం. దీంతో, ఎటువంటి భయం లేకుండా నాటుసారా తయారీదారులు బహిరంగంగా సారా విక్రయిస్తున్నారు. ఈ కారణంగా మద్యం దుకాణాలకు పూర్తిగా ఆదాయం గండి పడుతుంది.

ఎక్సైజ్ శాఖ నాటు సారాను నిరోధించడంతో పాటు ఇటీవల కాలంలో పెరిగిన గంజాయి రవాణా పై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించవలసి ఉంది. కొద్ది కాలం కిందట ఎక్సైజ్ శాఖలో సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఈ సమస్య ఉన్నప్పటికీ అసలు దాడులే పూర్తిగా జరగడం లేదని పలు విమర్శలు వినబడుతున్నాయి. దీంతో, గ్రామాలలో నాటు సారా విచ్చలవిడిగా పెరిగి పోవడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి సైతం భారీ గండి పడుతుంది. మరోపక్క గంజాయి కేసులు కూడా ఇటీవల కాలంలో బాగా తగ్గాయి.ఓ రకంగా చెప్పాలంటే ఎక్సైజ్ శాఖ కంటే సాధారణ పోలీస్ శాఖలోనే ఎక్కువగా గంజాయి కేసులు నమోదు అవుతున్నాయి. ఈ పరిస్థితులలో ఎక్సైజ్ శాఖ పట్ల అనేక విమర్శలు వినబడుతున్నాయి


నాటు సారా తయారు చేస్తున్న దృశ్యం (ఫైల్ పొటో)

ప్రయాణం.. ప్రమాదకరం..


పోలవరం కాలువ వద్ద తవ్వి వదిలేసిన రోడ్డు


చిద్రమైనఘాట్ రోడ్డు వద్ద చేరిన నీరు

ప్రజాశక్తి -కోటవురట్ల: నర్సీపట్నం- పోలవరం రోడ్డులో అప్రమత్తంగా లేకపోతే ప్రయాణం ప్రమాదకరమే. ఈ రోడ్డుపై ప్రయాణం అంటే నిత్యం తిరిగే ప్రజలతో పాటు కొత్తగా ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే? ప్రధానంగా ఇందేసమ్మ వాక వద్ద సమీపంలోని పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా రోడ్డును తవ్వేసి వదిలేశారు. అదేవిధంగా వరహానది అనుకొని ఉన్న చిద్రమైనఘాట్ రోడ్డు వద్ద ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందని నిత్యం ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు., నర్సీపట్నం డివిజన్ కేంద్రానికి వెళ్లే రహదారి కావడంతో పాయకరావుపేట, నక్కపల్లి, రాయవరం, ఎలమంచిలి ప్రజలు నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తూ ఉంటారు. ఈ రోడ్డుని అనుకొని పోలవరం కాలువ నిర్మాణం నిమిత్తం తవ్వేసి వదిలేయడంతో వాహనదారులు, ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాణిజ్య కేంద్రమైన తుని వెళ్లేందుకు, సమీపంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం కాలువ పనులు అర్ధంతరంగా నిలిచి పోవడంతో సమీపంలో రోడ్డుని అనుకొని సుమారు 20 అడుగుల లోతు వరకు తవ్వేసి వదిలేశారు. ఇదే విధంగా ఇందేశమ్మ ఘాట్ రోడ్డు వద్ద కూడా రోడ్డు చిద్రమై ఉండటంతోపాటు కొన్నిచోట్ల రోడ్డు నదిలోకి జారి ఉండటంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెబుతున్నారు. ఈ మార్గాన వెళ్లాలంటే భయ పడుతున్నారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మహిళా సర్పంచ్‌పై దాడి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఎన్.కంఠారం గ్రామ సర్పంచ్ బిడిజాన రాజేశ్వరిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దాడి చేశారు. బాధిత సర్పంచ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన యువకులు ప్రసన్న కుమార్, చిరంజీవిలు ఆదివారం మరమ్మతుకు గురైన తాగునీటి పథకం మోటార్‌ను ఎప్పుడు బిగిస్తారని సర్పంచ్ రాజేశ్వరిని ఆమె ఇంటికి వెళ్లి అడిగారు. మోటార్‌ను మరమ్మత్తులు చేయడానికి పంపించామని సోమవారం వెళ్లి తీసుకువస్తామని ఆమె సమాధానం చెప్పారు. మద్యం సేవించిన యువకులు ఆమెతో వాగ్వివాదం చేసి సర్పంచ్ నుదుటిపై గాయపరిచారు. దీంతో, వైద్యం నిమిత్తం ఆమెను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆ యువకులపై గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


గాయపడిన మహిళా సర్పంచ రాజేశ్వరి

గిరిజనులకు భవిష్యత్ ఏదీ?

ప్రజాశక్తి-హుకుంపేట: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం వైసిపి నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే ఉపయోగపడుతుందని, గిరిజన జాతికి భవిష్యత్ ఏదని గిరిజన సంఘం నేత క్రిష్టారావు పత్రిక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి చేసింది ఏమిలేదన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించిదన్నారు. ఆశ్రమల్లోని హెల్త్ వర్కర్లను తొలగించి విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలి కొదిలేసిందన్నారు. జీఓ 3పై సుప్రీంకోర్టులో పిటీషన్ వేయలేదని తెలిపారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలు మూసేసి ఉపాధ్యాయ ఉద్యోగాలను రద్దు చేసిందని విమర్శించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఐదు అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాజెక్ట్ అధికారిని కె.శ్రీగౌరి తెలిపారు. ఈ మేరకు ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గొలుగొండ మండలంలో రెండు కేంద్రాలకు, నాతవరం మండలంలో మూడు కేంద్రాలకు అంగన్వాడి ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందన్నారు. గొలుగొండ మండలం లో కొత్తమల్లంపేట-1 అంగన్వాడీ కేంద్రానికి ఓసి కేటగిరి, కొంగసింగి-1 కేంద్రానికి బిసి-ఎ కేటగిరికి కేటాయించారని ఆయా కేటగిరీలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాతవరం మండలంలో నాతవరం-3 కేంద్రానికి ఎస్సీ కేటగిరి, గుమ్మడికొండ పంచాయతీ చిక్కుడుపాలెం కేంద్రానికి ఓసి క్యాటగిరి, లింగంపేట పంచాయతీ బుచ్చింపేట కేంద్రానికి బిసి-ఎ కేటగిరికి కేటాయించారని, ఆయా కేటగిరీలకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆమె చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారు 1.07.2023 నాటికి 21 సంవత్సరాలు పూర్తయి 35 సంవత్సరాలకు మించకుండా ఉండాలన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు చేసుకోవాలని, అర్హత కలిగిన వారు ధృవపత్రాలతో దరఖాస్తులను 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రిజిస్టర్ పోస్టు లేదా నేరుగా గొలుగొండ ప్రాజెక్ట్ కార్యాలయానికి అందించాలని ఆమె తెలిపారు.



ఎస్సైకు పుష్పగుచ్చం ఇస్తున్న నేతలు

ఎస్ఐని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్రను లింగంపేట వైసిపి నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై సూర్యనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు కవిలేశ్వరరావు, పార్టీ నాయకులు గొంతిన ప్రసాదు, ఎ.నానిబాబు, మిడతన సత్తిబాబు, మద్దపు కామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా ఇవ్వాలి

జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్



ప్రజాశక్తి-నక్కపల్లి: సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులందరికీ ప్రభుత్వం మత్స్యకార భరోసా వర్తింప చేయాలని జాతీయ మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ, మత్స్యకార భరోసాపై ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గెజిట్‌తో మత్స్యకారులందరికీ తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ పథకాలకు మత్స్యకార భరోసా లింకు చేసి వేట నిషేధ సమయంలో ఇస్తున్న భరోసాను కుదించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలలో ఏ ఒక్క పథకం అయినా ఆ కుటుంబం లబ్ది పొందితే మత్స్యకార భరోసాకు అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దీంతో, మత్స్యకారులకు తీరని అన్యాయం జరుగుతుంద న్నారు. ప్రభుత్వ పథకాలు, కరెంటు బిల్లులతో సంబంధం లేకుండా వేట సాగిస్తున్న ప్రతి మత్స్యకార కుటుంబానికి మత్స్యకార భరోసా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామికి కట్టుబడి వేట నిషేధ సమయంలో ఇస్తున్న భరోసాను అందరికి వర్తింప జేయాలన్నారు.